క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు శిక్షణ

జగ్గంపేట: జిల్లాలోని నిరుద్యోగ యువతకు పీఎంకేవీవై పథకంలో భాగంగా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో మూడు నెలల పాటు ఇస్తున్నట్లు జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాధా రామకృష్ణన్ శుక్రవారం తెలిపారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు యువతి, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 95020 89936 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగురాలికి చేయూత



పెద్దిపాలెంలో వృద్ధురాలికి బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న యువకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం శెట్టిబలిజపేటలో దివ్యాంగురాలికి శుక్రవారం గ్రామ యువకులు చేయూతనందించారు. స్థానిక పీడీవై హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దివ్యాంగురాలు రాళ్ల వరలక్ష్మికి బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. దివ్యాంగురాలికి అండగా నిలిచిన యువకులను గ్రామ పెద్దలు అభినందించారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని హెల్పింగ్ హ్యాండ్స్ యువకులు తెలిపారు.

సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం



గెద్దనాపల్లిలో సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కిర్లంపూడి: గెద్దనాపల్లిలో వేంచేసిన సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటం, మేళతాళాలు నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు అమ్మవారి దీక్షను (మాలధారణ) స్వీకరించారు. వారంరోజుల పాటు అకుంటిత దీక్షతో అమ్మవారిని పూజిస్తామని మాలధారణ భక్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుని రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని చేపూరు గ్రామానికి చెందిన పెంకె సూరిబాబు (59) మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. సూరిబాబు ఈ నెల 9న తన స్వగ్రామంలో జాతీయ రహదారిని దాటుతుండగా అన్నవరం వైపు నుంచి తుని వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరిబాబును తునిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలు కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: ప్రస్తుత వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట అగ్నిమాపక కేంద్రం అధికారులు సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద హైవే అథారిటీ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగినప్పుడు వాటిని అదుపు చేయడం, మంటల్లో గాయపడిన వారిని ఎలా రక్షించాలనే దానిపై మాక్ డ్రిల్ ద్వారా అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది నిలమయ్య, సంతోష్, టీబీఆర్ ప్లాజా మేనేజర్ కరిముల్లా, ఎస్‌డబ్ల్యూసీ టోల్ మేనేజర్ చైతన్య పాల్గొన్నారు.

చేతబడి నెపంతో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట పెద జగ్గమ్మచెరువులో నివాసం ఉంటున్న పసగొడుగుల చినబాబూరావు చేతబడి చేస్తున్నాడనే నెపంతో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న పసగొడుగుల శ్రీనువాసు, అలిగోలు శివ దుర్గాప్రసాద్ ఈ నెల 2న అతనిపై దాడి చేశారు. కాగా చినబాబూరావుపై దాడికి పాల్పడిన వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టుకు తరలించగా ఈ నెల 23 వరకు కోర్టు రిమాండ్ విధించినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు.

వ్యర్థం..అనర్థం

- తుని పట్టణంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న చెత్త సమస్య
- కంపోస్టుయార్డు లేకపోవడంతో అవస్థలు
- వెంటాడుతున్న సిబ్బంది, వాహనాల కొరత

తుని: పట్టణాన్ని వ్యర్థరహితంగా (స్వచ్ఛ పట్టణంగా) తీర్చి దిద్దేందుకు అధికారులు తాపత్రయం పడుతున్నా పారిశుధ్య సిబ్బంది, వాహనాల కొరత, కంపోస్టుయార్డు లేక పోవడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. పట్టణంలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. పురపాలక సంఘం ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండడంతో ప్రతి దానికి ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుత జనాభాకు పూర్తి స్థాయిలో సేవలు అందాలంటే అవసరమైన మేరకు సదుపాయాలు కల్పించాలి.

రోజుకు 39 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

తుని మున్సిపాలిటీ గ్రేడు-2 స్థాయిలో ఉంది. 30 వార్డుల పరిధిలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. 14 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రోజుకు 20 వేల మంది పట్టణానికి పనులపై వస్తుంటారు. దీంతో పాటు సుముద్రతీర ప్రాంతంలో ఫార్మా కంపెనీలు రావడంతో ఉద్యోగులు నివాసం కొరకు 50 అపార్ట్‌మెంట్లు కట్టారు. వీటిలో 800 కుటుంబాలు ఉంటున్నాయి. పట్టణంలో రోజుకు 39 మెట్రిక్ టన్నుల మేర వ్యర్థాలు వస్తున్నాయి. వీటిని డంపింగ్ చేయడానికి సరిపడా యంత్రాలు లేవు. పారిశుధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. సేకరించిన చెత్తలో 30 శాతం కంపోస్టు తయారీకి వినియోగిస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను తాండవ నది ఒడ్డున ఏర్పాటు చేసిన తాత్కాలిక కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. దీంతో సమీపంలోని నివాస ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బందిపై పనిభారం

పురపాలక సంఘం నిబంధనల ప్రకారం 1200 మంది జనాభాకు నలుగురు పారిశుధ్య కార్మికులు ఉండాలి. వీరిలో ఇద్దరు రోడ్లపై చెత్త శుభ్రం చేస్తే, మరో ఇద్దరిని కాలవలు శుభ్రం చేయుట, చెత్తను ఎత్తి వాహనాల్లో వేయడానికి ఉపయోగిస్తారు. ప్రస్తుతం 99 మంది కార్మికులు మాత్రమే ఉన్నారు. దీంతో 30 వార్డులకు ముగ్గురు చొప్పున పనులు చేస్తున్నారు. వీరిపై పని భారం ఎక్కువ అవుతుంది. పూర్తి స్థాయిలో సిబ్బందిని భర్తీ చేయాలని ప్రజా ఆరోగ్య శాఖ అధికారి శేఖర్ కోరుతున్నారు.



తుని మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రిపేరులో ఉన్నవి

మినీ జేసీబీ-	1
డంపర్ ప్లేసర్-	1
డంపర్ బిన్లు-	04



సేకరించిన చెత్తను కంపోస్టు తయారీ కోసం ట్రెంచ్‌లో వేస్తున్న సిబ్బంది

అధికారులకు నివేదిక పంపాం

పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత లేకుండా భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. కొత్త వాహనాలు, డంపర్ బిన్లు కొనుగోలు చేయాల్సి ఉంది. నిధుల కొరత వలన ఇబ్బందులు ఉన్నాయి. కంపోస్టు యార్డు కోసం స్థలసేకరణ చేస్తున్నాం. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలి.



– ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, తుని

అవసరం	ఉండాల్సినవి	ప్రస్తుతం ఉన్నవి
పారిశుధ్య కార్మికులు	120	99
ట్రాక్టర్లు	08	06
కంఫాక్టర్	02	01
కంఫాక్టర్(బిన్స్)	50	37
పుష్‌కార్టులు	40	20
ట్రైసైకిళ్లు	20	10

ఆర్థిక స్వావలంబన సాధించాలి



లబ్ధిదారుడికి రుణమంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఏపీఎం సూర్యకుమారి అధ్యక్షతన బ్యాంకర్లు, దరఖాస్తుదారులకు శుక్రవారం ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన పథకం (పీఎంఈజీపీ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ నిరుద్యోగ యువతను వ్యాపారంలో ప్రోత్సహించేందుకు తీసుకున్న రుణంలో 30 శాతం వరకూ ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. బ్యాంకర్లకు ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేసుకొని రుణసదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తకొట్టాం, తిమ్మరాజుపేట గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు రూ.10 లక్షల చొప్పున పాతకొట్టాం యూనియన్ బ్యాంకు మేనేజర్ కె. సింహాచలం రుణాలు మంజూరు చేశారు. కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైరై.. తిరిగి విధుల్లోకి..

అన్నవరం: గత ఏడాది కాలంలో రిటైరైన ఏడుగురు ఉద్యోగులు హైకోర్టు ఉత్తర్వుల మేరకు తిరిగి అన్నవరం దేవస్థానంలో విధుల్లో చేరారు. వివరాలివీ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 2022 జనవరి 1 నుంచి 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, జాయింట్ కమిషనర్ తదితర ఉద్యోగులకు మాత్రమే దీనిని వర్తింపజేశారు. ప్రముఖ దేవాలయాల్లోని సిబ్బందికి అమలు కాలేదు. అన్నవరం దేవస్థానంలో గడచిన ఏడాది కాలంలో 60 ఏళ్లు నిండిన 15 మంది ఉద్యోగ విరమణ చేశారు. వీరిలో ఏడుగురు హైకోర్టును ఆశ్రయించారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచే జీఓను తమకు కూడా వర్తింపజేయాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఒక డీఈ, ఒక సూపరింటెండెంట్, ఐదుగురు రికార్డు అసిస్టెంట్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులు శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్ ఘనపాఠి, కోట శ్రీనివాస్, చిట్టిం వాసు, నగేష్, కొంపెల్ల సత్యనారాయణ మూర్తి, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

డ్వాక్రా రుణాల మోసాలపై విచారణ జరపాలి

ఏలేశ్వరం: డ్వాక్రా రుణాల పేరుతో చేసిన మోసాలపై విచారణ జరపాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం మహిళలు ర్యాలీ చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ అనుబంధ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ నుంచి మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ గతంలో డ్వాక్రా మహిళలకు రుణాల పేరుతో డబ్బులు ఇవ్వకుండా యానిమేటర్లు, మెప్మా ఉద్యోగి మోసం చేశారన్నారు. ప్రస్తుతం రుణాలు కట్టాలని సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా సంఘ అధ్యక్షురాలు గండేటి నాగమణి, కాపారపు శాంతికుమారి, కలిగట్ల సుజాత, తుమ్ము సత్యవతి, గుమ్మడి పాదాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

రైల్వేగేటు మూత.. వాహనదారులకు వెత

తొండంగి: మండలంలోని గోపాలపట్నం రైల్వేగేటు శుక్రవారం మరమ్మతులకు గురవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఈ రైల్వే గేటు మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే గేటు మరమ్మతులకు గురవ్వడంతో సుమారు గంటన్నర పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే అధికారులు, సిబ్బంది గేటుకు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు.



గోపాలపట్నంలో రైల్వేగేటు మూత పడటంతో నిలిచిపోయిన వాహనాలు

నత్తనడనక ఆక్రమణల తొలగింపు పనులు

- అధికారుల తీరుపై ప్రారంభం నుంచీ విమర్శలు
- పనులను అడ్డుకున్న దుకాణదారులు

ఏలేశ్వరం: కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉంది ఏలేశ్వరం పట్టణంలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ. నిబంధనల ప్రకారం ఆక్రమణలు తొలగించాల్సిన అధికారులు కొన్నిచోట్ల కావాలనే వివాదం కొనితెచ్చికుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపుపై తొలి నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైన్లు నిర్మించేందుకు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. పనులు చేపట్టి సుమారు నెలరోజులు కావస్తున్నా ఇప్పటివరకూ కొలిక్కిరాలేదు. నిబంధనల ప్రకారం 100 అడుగుల రహదారి ఉండాలని తొలుత నిర్ణయం తీసుకోగా దుకాణదారుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 80 అడుగులకు కుదించారు. దీనిని ప్రామాణికంగా తీసుకుని ఆక్రమణల తొలగింపు చేపట్టగా ఒక్కో చోట ఒక్కో రకంగా ఆక్రమణలు తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల 40 అడుగుల దూరం వరకే తొలగించారని, పక్కా భవనాలకు ఇబ్బంది లేకుండా పాకలను మాత్రమే తొలగిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగిస్తే దుకాణదారులు రోడ్డున పడతారని భావిస్తే కొందరు వ్యక్తులు కావాలనే వివాదాస్పదం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపును ఓ కొలిక్కి తెచ్చేందుకు నగర పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పోలీస్ శాఖలు సమన్వయంగా శుక్రవారం చర్యలు చేపట్టగా కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణల తొలగింపు మధ్యలోనే నిలిచిపోగా చర్చలు కొనసాగుతున్నాయి.



అధికారులను అడ్డుకుంటున్న దుకాణదారులు

క్లారిటీ లేకపోవడమే ప్రధానకారణం

ఆక్రమణలపై తొలగింపుపై అధికారులకు క్లారిటీ లేకపోవడమే వివాదాలకు ప్రధానకారణంగా మారింది. పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారులకు డ్రైన్లు నిర్మించవల్సి ఉండగా అక్కడక్కడ తొలగింపులు చేపట్టడం, డ్రైన్లు నిర్మించడం కొన్ని చోట్ల వదిలివేయడం విమర్శలకు దారి తీసింది. కచ్చితంగా మార్కింగ్ ఇచ్చి ఆక్రమణల తొలగింపు చేపడితే ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రై సైకిల్ అందజేత

గండేపల్లి: మండలంలోని మురారి గ్రామానికి చెందిన గాడి చంద్రరావుకు తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రై సైకిల్‌ను అందజేశారు. గతంలో చంద్రరావు కుడి కాలికి గాయం అవడంతో వైద్యులు కాలును తొలగించారు. దీంతో చంద్రరావుకు జనసేన మండల ప్రధాన కార్యదర్శి గ్రంధి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ట్రై సైకిల్‌ను అందజేశారు. అనంతరం చలో మచిలీపట్నం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ పాలిశెట్టి సతీష్, సత్తి సోమరాజు, తిక్కిశెట్టి రామాంజనేయులు, కె రాజు పాల్గొన్నారు.

సీతారామస్వామికి బంగారు చైన్ సమర్పణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వేంచేసిన సీతారామస్వామి వారి ఆలయానికి భక్తులు శుక్రవారం బంగారు గొలుసులు సమర్పించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామాచార్యులు తన భార్య రేజేటి లక్ష్మి పేరున రూ.3.50 లక్షల విలువైన 62 గ్రాముల మూడు బంగారు గొలుసులు, రెండు లాకెట్లను సీతారామస్వామి, సీతాదేవి, లక్ష్మణస్వామిలకు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర దివాకర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మలత మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలతో పాటు అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లపట్టాలు వంటి అనేక సంక్షేమ పథకాలను మహిళలే కేంద్ర బిందువుగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఐకేపీ ఏపీఎం సత్తిబాబు ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలతను ఘనంగా సన్మానించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు అడ్డాల సూర్యకాంతం, జిల్లా ఉత్తమ సీసీ అవార్డు గ్రహీత సత్యవేణి, ఎంపీపీ అంగుహరి అరుణ్‌కుమార్ సతీమణి సుశీల, ఉత్తమ అకౌంటెంట్‌గా ఎంపికైన శ్యామలను సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



తొండంగిలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత సత్కరిస్తున్న అధికారులు

దివ్యాంగులకు వినికిడి యంత్రాల పంపిణీ

తుని రూరల్: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. స్థానిక భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ కేఎస్‌డీఎస్ వరప్రసాద్ రూ.26 వేల విలువ చేసే వినికిడి యంత్రాలు, స్కూల్ బ్యాగులను అందజేశారు. వినికిడి సమస్యలు ఉన్న చిన్నారులకు సౌండ్ థెరిపీ శిక్షణ ఇస్తామని భవిత కేంద్రం ఉపాధ్యాయులు తెలిపారు. యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం అందించిన వినికిడి యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాకినాడ రీజినల్ హెడ్ కేఎస్‌వీ చిన్నారావు, స్థానిక బ్యాంకు మేనేజరు ఎస్.వెంకట్, తుని మహిళా జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కలిదిండి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు అధికారి వరప్రసాద్

నులి పురుగుల నివారణకు సర్వం సిద్ధం

కిర్లంపూడి: నులి పురుగుల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఎంపీడీఓ బి.సతీష్‌బాబు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, విద్య, అంగన్‌వాడీ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నెల 14 నుంచి 18 వరకూ అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్లూ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో పర్యటించి జ్వరాలపై సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.జోసెఫ్, పీహెచ్‌సీ వైద్యులు రాంబాబునాయక్, చంద్రకిరణ్‌బాబు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఏలేశ్వరం: నులిపురుగుల నివారణకు పట్టణంలో శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, ఎంపీడీఓ సూర్యనారాయణ, వైద్యాధికారి చంద్రకిరణ్ ఆధ్వర్యంలో విద్యా సంస్థలకు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. మండలంలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్నవారు 16,807 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఆరోగ్యవిస్తరణాధికారి భాస్కరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



శంఖవరంలో ఆరోగ్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు

జగ్గంపేట: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీడీఓ బి.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై చర్చించారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆల్బెండజోల్ పంపిణీ చేశారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

శంఖవరం: నులి పురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీఓ జె.రాంబాబు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ నెల 14 నుంచి విద్యార్థులందరికీ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కిర్లంపూడిలో వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ సతీష్‌బాబు

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం డీవార్మింగ్ డేపై ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.పిల్లల్లో నులిపురుగు నివారణకు ఈ నెల 14న మండల వ్యాప్తంగా ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు.

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం ఎంపీడీఓ పసపులేటి సతీష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఈఓ షేక్‌బాబ్జీ సమక్షంలో పీహెచ్‌సీల వైద్యులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు.

భద్రత పాటిస్తేనే ప్రమాదాల నివారణ

- ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ
- ఎన్‌ఎఫ్‌సీఎల్‌లో 52వ భద్రతా వారోత్సవాలు

కాకినాడ రూరల్: భద్రతా సూత్రాలను పాటించడం ద్వారానే కర్మాగారాల్లో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నాగార్జున ఫెర్టిలైజర్స్ కర్మాగారంలో 52వ భద్రతా వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. కర్మాగారంలోని పలు విభాగాలు పరిశీలించి, రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్లాంట్ డిజైన్ దశ నుంచే విధాన రూపకల్పన, వ్యక్తి గత రక్షణ పరికరాల వినియోగంలో ఎన్‌ఎఫ్‌సీఎల్ తగు జాగ్రత్తలు పాటిస్తుందన్నారు. భద్రతా వారోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రమాద రహితమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన మాక్ డ్రిల్‌లో పాల్గొన్న అధికారులను ఆయన అభినందించారు. ఎన్‌ఎఫ్‌సీఎల్ సీనియర్ జీఎం పి.చంద్రమోహన్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతో ప్లాంట్ భద్రతకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. మెయింటెనెన్స్ హెడ్ పి.విజయకుమార్ మాట్లాడుతూ ప్లాంట్‌లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పని ఒత్తిడిని జయించేందుకు వివిధ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఆ పోటీల్లో విజేతలకు డీఐ రాధాకృష్ణ బహుమతులు అందజేశారు. ఫైర్ అండ్ సేఫ్టీ హెడ్ మహంతి పాల్గొన్నారు.



ఎన్‌ఎఫ్‌సీలో భద్రతా పరికరాలను పరిశీలిస్తున్న డీఐ రాధాకృష్ణ